

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## కళ్యాణం కమనీయం - కన్నుల పండువగా రథోత్సవం



**వింజమూరు, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త):** వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం కమనీయంగా నిర్వహజంచారు. ఆలయ ఇఒ మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు జరిపించి పూజాదికాలు నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి కళ్యాణవేదికపై అధిష్టించారు. ఆలయ అర్చకులు సుధాకర్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో కళ్యాణతంతును జరిపించారు. హిందూధర్మం ప్రకారం జీలకర్ర, బెల్లం తలపై ఉంచి హిందూ ధర్మం ప్రకారం కళ్యాణఘట్టాన్ని కమనీయంగా నిర్వహించారు. మంగళసూత్రాన్ని భక్తులకు చూపి అమ్మవారి మెడలో కట్టారు. ముత్యాల తలంబ్రాలతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. కళ్యాణాన్ని చూసి భక్తులు తరించారు. స్వామివారి, అమ్మవారిని ని రథంపై ఉంచి రథాన్ని పుష్పమాలలతో సర్వాంగసుందరంగా అలంకరించి ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడి ముందుకు వచ్చారు. రథాన్ని లాగుతున్నప్పుడు వైకుంఠవాసుడు కదలివచ్చాడన్నట్లు భక్త జనం రథోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కలిగిరి సిఐ సాంబశివరావ్, స్థానిక ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, కలిగిరి ఎస్ఐ ఖాజావలి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఇటీవల ఆలయ ధర్మకర్తపై నెలకొన్న సందిగ్ధత తో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబులురెడ్డి, యువనాయకులు శివశంకర్‌రెడ్డి, దాట్ల విజయభాస్కర్‌రెడ్డి, గాలి నరసపనాయుడు, గాలి రామ్మోహన్‌నాయుడు , చీమల విజయభాస్కర్‌రెడ్డి, బుర్రాల శ్రీనివాసులు, ఎంఎస్‌నాయుడు, కుంకు కొండస్వామి , చీమల రత్నాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణం...కమనీయం... కోదండరాముని కల్యాణం



**బుచ్చి ఏప్రిల్ 5 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కోనేటిమిట్టన కొలువైవున్న శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీకోదండరామస్వామి వారి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష భక్తజనవాహిని కల్యాణం తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కల్యాణవేదికపైన కోదండరామునికి ఒక వైపు సీతమ్మ తల్లి, మరొకవైపు లక్షణ స్వామి వుండగా స్వామి వారి కళ్యాణం కన్నులపండుగగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తునస్వామి వారి కల్యాణం తిలకించి పరవశించారు. ఆలయ వ్యవస్థాప ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు ,ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణం అనంతరం భకు_లు తలంబ్రాలు కోసం పోటిపడ్డారు .కళ్యాణం సమయంలో పెద్ద ఎత్తున మహిళలు యువకులు శ్రీరామనామని జపించారు. కళ్యాణం అనంతరం స్వామి వారు ఉత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. డిఎస్‌పి ఆంజనేయులరెడ్డి, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

సిఐ రామారావు ,బుచ్చి ఎస్ఐ వీరప్రతాప్, పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నేడు రథోత్సవం:**

స్వామి వారి రథోత్సవం ఉదయం కన్నుల పండుగగా జరగనుంది. రాత్రికి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి భక్తులు విచ్చేసి స్వామి వార్లను అమ్మవార్ల దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని నిరా వ్యాహకులు పిలుపునిచ్చారు.

## పొన్నమానుపై శ్రీచెన్నకేశవుడు



**వింజమూరు, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త):** వింజమూరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవుడు సోమవారం రాత్రి వెండిపొన్నమాను వాహనంపై భక్తులకు ధర్శనమిచ్చారు. కొత్తూరు వాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు .రాత్రివేళ జరుగుతున్న ఉత్సవాలు విద్యుత్ అలంకరణలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అబ్బురపరుస్తున్నాయి. స్వామివారు ఆలయం నుండి పొన్నమానుపై అలంకృతుడై భక్తులకు దర్శనమిచ్చారు .యర్రబల్లిపాళెం దేవస్థానం నుండి సీతారాంతోట, కొత్తూరు, నడిమూరు, పాతూరు , వెలమబజారు, వైశ్యాబజారుల మీదుగా స్వామివారి బ్రహోత్సవం సాగింది. కళ్ళు మిరిమిట్లు గొలిపే బాణాసంచా మోతలు ఆకర్షణగా నిలిచాయి. యువత కేశవ, చెన్నకేశవా అంటూ స్వామివారిని ఊరేగించారు .ఈకార్యక్రమంలో వంశపారంపర్య ఆలయ ధర్మకర్తలు గణపం వెంకటరమణారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డిలు కార్యక్రమాలను పర్యవేక్షించారు . ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కలిగిరి సిఐ సాంబశివరావ్ , స్థానిక ఎస్ఐ రంగనాథ్‌గౌడ్‌లు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సస్పెండ్



**కావలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** వైసిపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, కావలి మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసిపి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు పంపింది. ఈ ఆకస్మిక పరిణామానికి కావలి నియోజకవర్గంలోని వైసిపిలో తీవ్ర సంచలనంతో పాటు చర్చనీయాంశానికి దారితీసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపధ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుల మేరకు పార్టీ అధ్యక్షులు, సియం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మన్నెమాలను సస్పెండ్ చేసినట్లు విడుదలైన ఉత్తర్వులలో పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి కావలి నియోజకవర్గంలో ఏ నోట విన్నా మన్నెమాల సస్పెన్ష మాటే వినపడుతోంది. నిన్నగాక మొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన మండల నేతల, సచివాలయ కన్వీనర్ల, వైసిపి నేతల సమావేశంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా సస్పెండ్ చేస్తానని ప్రకటించిన 24 గంటల్లోనే మన్నెమాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడటంతో చర్చనీయాంశమైంది. ఇటీవల కొంతకాలంగా రామలక్ష్మణులుగా ప్రకటించుకున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, షాడో ఎమ్మెల్యేగా ముద్ర వేసుకున్న మన్నెమాల సుకుమార్‌రెడ్డిల మధ్య విభేదాల మూలంగా మన్నెమాలను దూరంగా పెట్టినట్లు ప్రచారం సాగుతుంది. దాదాపు నాలుగు సంవత్సరాల పాటు కావలి వైసిపి పార్టీలో అన్ని తానై చక్రం తిప్పిన మన్నెమాలను సస్పెండ్ చేయడంలో రకరకాల ఊహాగానాలు వైసిపి నేతలు ప్రచారం చేస్తున్నారు.

## సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అబ్దుల్



**నెల్లూరు ఏప్రిల్ 4, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని జాతీయ రహదారికి అనుకుని ఉన్న వేణుగోపాలస్వామి కళాశాల ప్రాంగణంలో ఈనెల 7న జరిగే జోన్-4 సమీక్షా సమావేశానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా. చంద్రబాబునాయుడు రానున్న తరుణంలో ఆ సభా ప్రాంగణాన్ని మంగళవారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో దుర్మార్గమైన ప్రభుత్వాన్ని ఎలా ఎదుర్కోవాలి, ప్రజలకు ఎలా చేరువకావాలి, ప్రజా సమస్యలపై ఎలా పోరాడాలి అన్న అంశాలపై దిశా నిర్ధేశం చేస్తారని తెలిపారు. ఏప్రిల్ 7న ఉదయం 9గంటల 30 నిమిషాల నుండి ప్రతి పార్లమెంటుకు ఒక రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలపై పోరాటానికి సమస్యల పరిష్కారానికి పార్టీ లీగల్ సెల్ ద్వారా ప్రత్యేకంగ కృషి చేస్తామన్నారు. 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నారా. చంద్రబాబు జోన్-4కి దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆయనతోపాటు దొడ్డపనేని. రాజానాయుడు, మన్నెం. పెంచలనాయుడు, సాబిర్‌ఖాన్, మాతంగి. కృష్ణ పాల్గొన్నారు.

## కోనలో వైభవంగా నృసింహునికి శేషవాహన సేవ



**పెంచలకోన(రాపూరు), ఏప్రిల్04 ప్రభాతవార్త**

పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి వారికి వేసవి తాపం తగ్గించేందుకు స్వామి వారికినిర్వహిస్తున్న వసంతోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, చందనం, తేనే, కుంకుమ, ఇతర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం విశేష పూజలు, ఆగ్నిరాధన నిర్వహించారు. స్వామి వారికి శేషవాహన సేవను మంగళవాయిద్యాల మద్య కోనలో వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా పెనుబర్తి గ్రామానికి చెందిన బండి రాఘవ రెడ్డి, జయలక్ష్మీ, బండి పెంచలనరసా రెడ్డి, అనంతలక్ష్మీ, బండి తిరిపాల్ రెడ్డి, తేజ వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, సిబ్బంది లక్ష్మీనారాయణ, సారధీ తదితరులుపర్యవేక్షించారు.

## వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు



**నెల్లూరు, ఏప్రిల్4 ప్రభాతవార్త-విద్య** జిల్లాలోని ప్రయివేట్ జూనియర్ కళాశాలల నిర్వాహకులు వేసవి సెలవు దినాల్లో ఎటువంటి తరగతులు నిర్వహించేందుకు అనుమతులు లేవని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి. వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. సెలవు దినాల్లో జూనియర్ కళాశాలల నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో ప్రత్యేక తరగతులు నిర వ్యహిస్తే ఊరుకోబోమన్నారు. బోర్డు నిభందనల మేరకు విద్యార్థులకు సెలవులు ఇవ్వాలని, నిబంధలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మహిళా సంక్షేమమే ధ్యేయం



**వెంకటాచలం ఏప్రిల్ 4 ప్రభాతవార్త** మహిళా సంక్షేమమే ద్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, మహిళలను రంగాలో పురుషులతో సమానంగా రాణించాలనే లక్ష్యంతో పని చేయటం జరుగుతుందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. మండల పరిదిలోని ఎర్రగుంట వద్ద ఉన్న కమ్యూటిహాల్‌లో నిర్వహించిన వైఎస్ ఆర్ అసరా, మూడో విడత రుణమాఫీ నిదులు పంపిణి కార్యక్రములో డిఆర్‌డిఏ పీడి సాంబశివారెడ్డితో కలిసి మంత్రి కాకాణి పాల్గోన్నారు. మాట తప్పకుండా ఇచ్చిన ప్రతి హమీని అమలు చేస్తున్న ఘనత, ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. పేదరికం వలన ఎవ్వరు ఇబ్బంది పడకూడదని కుటుంబాలకు ఆర్థిక బరోసా కల్పిస్తే ఆర్థిక స్వావలంబన సాదించి సంతోషంగా జీవిస్తారనే లక్ష్యంతోనే సిఎం వాయస్ఆర్ అసరా ,చేయూత, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, వాహన మిత్ర, ఈబీసి నేస్తం, అనేక పదకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని మహిళలను సోంత అక్కా చెల్లెలుగా బావించి, పాదయాత్రలో ఇచ్చిన హమీ మేరకు స్వయం, సహయక సభ్యులకు అసరా మూడో విడత నిధులను సిఎం విడుదల చేస్తున్నారన్నారు. ఎలాంటి అవనీతికి తావులేకుండా పారదర్శకంగా నేరుగా మహిళలు ఖాతాలో నగదును జమ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలోని ,34,440 గ్రూపులకు 826 కోట్లు మంజూరు చేశామన్నారు. అందులో సర్వేపల్లి నియోజకవర్గనికి సంబదించి 4056 గ్రూపులకు 91 కోట్ల 83, లక్షలు నిదులు మంజూరు చేశామన్నారు. పెద్ద మెత్తంలో ఒక పదకానికి నిదులు కేటాయించడం గతంతో ఎన్నడు లేదన్నారు. కరోనా వంటి పరిస్దితిలో కూడ ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే రెండు విడతలు మంజూరు చేసి మూడు విడత నిదులు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సహయాన్ని సద్వినియోగం చేసుకోని విబిన్న తరహ జీవనో పాదులు ఎచ్చుకోని ఆర్ధిక సుస్దిరత సాదించాల న్నారు. అనంతరం మహిళలు పోందుతున్న పనిముట్లును స్టాల్‌ను మంత్రి పరిశీలించి, పనితీరు, ఏవిదంగా లభాలు పోందువచ్చా అనే విషయాలు మహిళలు వద్ద నుంచి అరాతీశారు. గొర్రె పిల్లలు, కోళ్లను మంత్రి మహిళలకు అందజేశారు. ఎంపీడివో సుస్మిత, ఎంపిపి మందా కవిత, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, జిల్లా వైసిపి అదికార ప్రతినిది మందల వెంకటశేషయ్య, మోహన్‌నాయడు, భాస్కర్‌నాయడు, మండలంలో స్వయం సహయక సభ్యులు పాల్గోన్నారు.

## విఎస్‌యూ అభివృద్ధికి సహకారం అందిస్తాం



**వెంకటాచలం ఏప్రిల్ 4 ప్రభాతవార్త** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ఎప్పుడు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తామని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిదిలో కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో సోమవారం స్వర్ణముఖీ మహిళా వసతి గృహంలో నూతనంగా నిర్మించిన రెండో అంతస్తు భవనాన్ని వీసి సుందరవల్లితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లడుతూ రాష్ట్ర నుంచి వచ్చిన విద్యార్ధులను తన సోంత పిల్లలుగా చూచుకోవాలని సూచించారు. విద్యతోపాటు, క్రీడలపై శ్రద్ద వహించి తల్లిదండ్రులకు గురువులకు మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకోని రావలని విద్యార్ధులకు మంత్రి కాకాణి సూచించారు. వీసీగా సుందరవల్లి భాద్యతలు చేపట్టిన నుంచి యూనివర్శిటి అభివృద్ధికి నిరంతరం కృషి చేశారన్నారు. కష్టపడి విద్యను అభ్యశించి జీవితంలో ఉన్నత స్దాయికి ఎదిగి పది మందికి చేయూత అందించాలన్నారు. వసతి గృహములో డైనింగ్ హల్‌కోరతగా ఉందిని మంత్రి కాకాణి దృష్టికి తీసుకోని రావడంతో త్వరంలో డైనింగ్ హల్‌ను పూర్తి చేస్తామని మంత్రి హమీ ఇచ్చారు. విద్యార్ధులు బాగా చదివి అన్ని రంగాలలో విశ్వవిద్యాలయ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని విద్యార్ధులకు మంత్రి అకాంక్షించారు. ఈకార్యక్రములో రిజీస్ట్రార్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ విజయ అనంద్‌కూమర్‌బాబు, సుజాఎస్‌నాయర్, కిరణ్మయి తదితరులు పాల్గోన్నారు.

**డైనింగ్ హాల్‌కు రాచాల 2 లక్షలు వితరణ**

మాజీ రూరల్ జడ్పిటిసి సభ్యులు వైసిపి నాయకులు రాచాల రవికుమర్ యాదవ్ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాలో స్వర్ణముఖీ మహిళ వసతి గృహంలో విద్యార్ధులు డైనింగ్ హల్ నిర్మాణం కోసం మంత్రి కాకాణి సమక్షంలో రెండు లక్షలు చెక్కును వీసికి అందజేశారు. దీంతో రాచాల రవికుమర్ యాదవ్‌ను విఎస్‌యూ, వీసి, రిజీస్ట్రార్ అబీనందనలు తెలిపారు.

## రాజకీయాలలో సస్పెన్షన్లు సర్వసాధారణం

## రాజ్యసభ సభ్యులు బీద సంచలన వ్యాఖ్యలు

**కావలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** రాజకీయాలలో సస్పెన్షన్లు సర్వ సాధారణమని రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కావలి పట్టణం క్రీడామైదానంలో మంగళవారం బీద మస్తాన్‌రావును మీడియా ప్రతినిధులు కలిశారు. కావలి మాజీ ఎయంసి చైర్మన్, షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న మన్నెమాల సుకుమార్‌రెడ్డి సస్పెన్షన్‌పై మీ కామెంట్ ఏమిటని బీదను ప్రశ్నించారు. రాజకీయాలలో నేతల్ని పార్టీ నుంచి డిస్మిస్ చేస్తే అది వార్త అని, సస్పెన్షన్ సర్వసాధారణమని బీద అనడంతో పెద్దదుమారం లేచింది. సస్పెన్షన్ అయిన వారు తగిన సమాధానం అధిష్టానానికి తెలిపితే సస్పెన్షన్ రద్దు అవుతుందన్నారు. అందువల్ల సస్పెన్షన్ సర్వసాధారణమన్నారు. బీద వ్యాఖ్యలు మన్నెమాలకు మద్దతు ఇస్తున్నట్లుగా వుందన్న ప్రచారం కావలిలో జోరుగా సాగింది.

## శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు



**కలువాయి ఏప్రిల్ 4 ప్రభాతవార్త** అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ ఆదిలక్ష్మి ,చెంచు లక్ష్మీ సమేత లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలను కలువాయిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్దానం నందు వేద పండితులు శా స్త్రోక్తంగా నిర్వహించడం జరుగుతుంది మంగళవారం కార్యక్రమాలలో భాగంగా సుప్రబాతసేవతోపాటు విశేష కార్యక్రమాలనుతిరిచి వాహన సేవ అదే విదంగా సాయింత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం యజ్ఞహోమాదాలు లఘుపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం హనుమంతసేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. ఆలయ వ్యవస్దాపకులు నరసయ్యస్వామి ఆద్వర్యంలో టిటిడి ఆగమ పండితులు రామానుజచార్యులు ఆలయ ప్రధానార్చకులుసోమశేకర్‌స్వామి వేదపండితుల బృందం కార్యక్రమాలను నిర్వహించారు.

## కేంద్రానిది రైతు వ్యతిరేక పాలన



**నెల్లూరు, ఏప్రిల్31 ప్రభాతవార్త-విద్య** కేంద్రంలోని మోదీ ప్రభుత్వానిది పూర్తిగా రైతు వ్యతిరేఖ పాలన అని, పేదలను కొట్టి కార్పోరేట్ శక్తులకు పెంచి పోషిస్తున్న ప్రధానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గునపాఠం చెప్పాలని రైతుకూలీసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్. ఝాన్సీ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని స్థానిక ఏనుగుసుందరరామిరెడ్డి ఆడిటోరియంలో రైతుకూలీసంఘం ఉమ్మడి నెల్లూరుజిల్లా మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజేపి ప్రభుత్వ పాలనలో అన్నీ రంగాలు సంక్షోభంలో ఉన్నాయన్నారు. బిజేపి ప్రవేశ పెట్టిన మూడు వ్యవసాయ వ్యతిరేఖ చట్టాలకు నిరసనగా రైతులు దేశ రాజధాని సరిహద్దుల్లో ఏడాది పాటూ ఆందోళనచేసి చివరికి విజయం సాధించారని, ఎవ్వరికి లొంగని మోదీ ప్రభుత్వం తొలిసారి రైతులకు క్షమాపణలు తెలిపి చట్టాలను ఉపసంహరించుకుందన్నారు. హక్కులను పోరాటాల ద్వారానానే సాధించుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి జి. సునీత, ఏఐఎఫ్‌టియూ న్యూ రాష్ట్రకార్యదర్శి జే. కిషోర్‌బాబులు మాట్లాడుతు 75 సంవత్సరాల స్వతంత్ర దేశంలో నేటికీ వ్యవసాయ, పారిశ్రామీక రంగాల్లో మౌళిక మార్పులు పూర్తిస్దాయిలో రాలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు పేదలను కొట్టి కార్పోరేట్ శక్తులను పెంచి పోషిస్తున్నట్లు ఉందన్నారు. నల్లధనం వెలికి తీతలో మెదీ విఫలం చెందారని ఆరోపించారు. రైతులకు అన్యాయం జరిగే ఏ చర్యలు ప్రభుత్వం తీసుకున్నా దానిని తాము వ్యతిరేఖిస్తామన్నారు. అనంతరం సంఘ నూనత జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్. సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా వి. రవీంద్ర, కార్యదర్శిగా జి. సునీతలు ఎంపికైయ్యారు. తొలుత రైతు కూలీ సంఘం నాయకులు ఎ ర్రజెండాలను చేతబూని నగరంలో భారీ ర్యాలిని నిర వ్యహించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు ఓబయ్య, శరవణన్, స్రీ_విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి. కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలే కీలకం



**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** సీజన్‌లో వచ్చే వ్యాధులు.. రక్తహీనతతో బాధ పడే మహిళలు అటువంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించేలా ఆశా కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరన ఎం. పెంచలయ్య అన్నారు. కోవూరులోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త వారి వారి పరిధిలో అనునిత్యం పర్యటిస్తూ ఆరోగ్య పరమైన సలహాలు, సూచనలు ప్రజలు ఇవ్వడమే కాకుండా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వాటిని ఏఎన్ఎం దృష్టికి తీసుకురావాలన్నారు. ఇటీవల కాలంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలో 3 మాతృమరణాలు జరిగాయని, అటువంటి మళ్లీ పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు కీలకమని, ముఖ్యంగా గర్భవతులపై ప్రత్యేక దృష్టి సారించి రక్తహీనత లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తీరు మారకపోతే ఆశాలపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఎవరికి కేటాయించిన విధులు బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఆశాల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిబాబు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

# 1128 పొదుపు మహిళా సంఘాలకు 8. 96 కోట్ల పంపిణీ




**కావలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** 1128 పొదుపు మహిళా సంఘాలకు 8 కోట్ల 96 లక్షల రూపాయల చెక్కును రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు అందజేశారు. కావలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధులు విడుదలను పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. సియం జగన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల కరోనా, తదితర ఇబ్బందుల కారణంగా కావలి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనలేకపోయానన్నారు. ఇక నుంచి కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను, ప్రతాప్‌రెడ్డి ఇద్దరం కలిసికట్టుగా అన్నదమ్ముల్లా, రామలక్ష్మణులుగా కలిసి పనిచేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళా సాధికారితకు పెద్దపీట వేశారన్నారు. తెలుగుదేశం పాలనలో 25 వేల కోట్ల రూపాయలు మహిళలకు రుణమాఫి చేస్తానని మొండిచేయి చూపించారన్నారు. సియం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఈ రుణమాఫిని మూడు విడతలుగా చేయడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికలలో తిరిగి సియంగా జగన్మోహన్‌రెడ్డి గద్దెనెక్కుతారన్నారు. కావలిలో మళ్లీ వైసిపి బావుటాను ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు సహకారంతో కావలి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. బీద మస్తాన్‌రావు ఎమ్మెల్యే పాలనలో కావలి నియోజకవర్గ అభివృద్ధి బాగా జరిగిందని కితాబు ఇచ్చారు. టిడిపి ప్రతిచోట సమస్యలు సృష్టిస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాటిని అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు పరుగులు తీయిస్తున్నారన్నారు. మహిళాభ్యుదయానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి బుద్దిచెప్పాలన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కావలి నియోజకవర్గ పరిశీలకులు కదిరి బాబురావు, ఆర్డీవో శీనానాయక్, మండల ప్రత్యేకాధికారి కె. రమేష్‌నాయక్, డిఎల్‌పివో కనకదుర్గభవాని, ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు, ఎంపిపి ఆలూరి కొండమ్మ, ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, మాజీ ఎయంసి చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ళ శ్రీనివాస కిరణ్, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాయుడు రాంప్రసాద్, ఎపియం కాంతారావు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## ఈనెల 7 న చంద్రబాబు పర్యటన విజయవంతం చేయండి



**ఉదయగిరి ఏప్రిల్4(ప్రభాతవార్త:** ఈనెల 7వ తేది మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు జిల్లా పర్య టన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మాజీ జడ్‌పి చైర్మన్ పొన్నుబోయిన చెంచల బాబుయా దవ్ పిలుపు నిచ్చారు. మండలకేంద్రమైన ఉదయగిరిలోని చెంచలబాబు అతిధి గృహంలో విలేఖర్ల సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నెల్లూరులోని వేణుగోపాల్ నగర్‌లో జరిగే జూనల్ విస్తృత స్థాయి తెలుగుదేశం పార్టీ మండల జిల్లా స్థాయి నాయకులతో మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబా బునాయుడు సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి నియోజ కవర్గంలోని 8 మండ లాలకు చెందిన తెలుగుదేశం పార్టీనాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గోని చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి పాలనకు అంతం పలికే దిశగా తెలుగుదేశం పార్టీయొక్క యువనేత లోకేష్‌బాబు పాదయాత్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్ర బాబునాయుడి సమీక్షా సమావేశాల ద్వారా వైసిపి పార్టీకి నిద్ర పట్టడం లేదని శాసన మండలి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపునుజీర్ణించుకోలేక అవాక్కులు చెవాక్కులు మాట్లాడుతు వైసిపి నాయ కులు పబ్బం గడుపుకుం టున్నారని తెలిపారు. రాబోయే రాజులలో చంద్రబాబునాయుడు నాయకత్వ ంలో ఏపి ఎన్నికలు జరిగినా తెలుగుదేశం పార్టీ విజయం తధ్యమని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ సిహెచ్ బయ్యన్న, రియాజ్, ఓబుల్‌రెడ్డి, బిసి సెల్‌నాయకులు ఆదినారాయణ, ముదిరాజ్, మండల మాజీ ఉపాధ్యాక్షులు సిహెచ్ రమణయ్య, నల్లిపోగు నరసింహులు, బుజ్జా నరసింహులు, శివా, తదితరులు పాల్గోన్నారు.

## నూతన న్యాయవాద సంఘం ఏర్పాటు

**కందుకూరు, ఏప్రిల్4, ప్రభాతవార్త:** కందుకూరు న్యాయవాదుల సంఘం కొత్త కార్యవర్గం మంగళవారం ఏర్పడింది. అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. 2023-2024సంవత్సరానికి గాను నలుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక కావడం జరిగింది. అసోసియేషన్‌అధ్యక్షుడిగా ఎం. మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా చెనికల రమేష్, సెక్రటరీగా ఎస్. పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ ముస్తాఫ్ రెహ మ్‌న్, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా తిరుమలరావు ఎన్నికైయ్యారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. అనంతరం నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## ఇళ్లను తొలగించకుండానే పనులు పూర్తి



**నెల్లూరు సిటీ, ఏప్రిల్4, ప్రభాతవార్త:** కాలువ గట్లపై నివసించే వారి ఇళ్లను తొలగించకుండానే అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని మాజీమంత్రి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్ తెలిపారు. సిటీ 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘం ప్రాంతంలో అధికారులు, స్థానిక నేతలతో కలిసి పర్యటిం చారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ సర్వేపల్లి కాలువకు సంబంధించి సుమారు 75శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. వుడ్ హౌస్ సంఘం, సీఆర్పీ డొంక ప్రాంతంలో మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను సూచించారు. గత ప్రభుత్వంలో కాలువ గట్లపై ఉన్న ఇళ్ళకు మార్కింగ్ చేశారని వీటిని తొలగించకుండానే శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులుపూర్తి చేస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. లబిధదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. రానున్న ఐదు నెలల్లో నగర రూపురేఖలుమారిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, ఇతర వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## వింజమూరు సిహెచ్‌సి అభివృద్ధికి తిప్పిరెడ్డి నిరంతర కృషి



**వింజమూరు, ఏప్రిల్4(ప్రభాతవార్త:** వింజమూరులోని ప్రభుత్వ సామాజిక వైద్యఆరోగ్యకేంద్ర అభివృద్ధికి ఒన్ ఇండియా-ఒన్ విలేజ్ పేరుతో నిరంతరం ప్రజా సేవలు చేసేందుకు తిప్పిరెడ్డి కుటుంబం కృషి చేస్తుందని మాజీ జడ్పీటిసి సభ్యులు తిప్పిరెడ్డి నారపరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల సౌకర్యార్థం తమ ట్రస్ట్ ద్వారా రోగులు కూర్చొనేందుకు దాదాపు 40వేల రూపాయల విలువ కలిగిన బెంచీలను విరాళంగా అందజేశారు. తిప్పిరెడ్డి నారపరెడ్డి ఇప్పటికే తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిడిఒ శ్వేతా బిల్లా, వైద్యులు గున్నం మదన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ సబితాహెస్తేరు, డాక్టర్ ముస్వీర్‌సాహు , నాయకులు నిమ్మకాయల కృష్ణారెడ్డి, బి. సుబ్బారావు, దాట్ల శ్రీనివాసులురెడ్డి, ఎంపిడిఒ ఎస్. కె. జహీర్, ఆసుపత్రి సిబ్బంది వెంకట్రావ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతు వాహనంపై కోదండరాముడు



**వింజమూరు, ఏప్రిల్4(ప్రభాతవార్త:** వింజమూరు మండలం బత్తినవారిపల్లిలో వేంచేసియున్న శ్రీ కోదండరా ముడు శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా హనుమంతు వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేకపూజలు , అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన సుగంధపరిమళాలతో ఏర్పాటు చేసిన రథంపై ఉంచిన హనుమంతు వాహనంపై శ్రీరామచంద్రుడు కొలువుదీరాడు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా కాకర్ల హుసేన్‌నాయుడు, కాకర్ల వెంగళరావ్, కాకర్ల మాల్యాద్రి, కాకర్ల విష్ణురావ్, బోడేపూడి వెంకటేశ్వర్లు, వై. రాఘవయ్య, జి. రమణయ్య, పి. వెంకటేశ్వర్లు, కాకర్ల రమేష్, కాకర్ల మల్లి, పి. రవిలు వ్యవహరించారు.

## పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒ

**వింజమూరు, ఏప్రిల్4(ప్రభాతవార్త:** వింజమూరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శీనయ్య పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలతో వింజమూరులో రద్దీ వాతావరణం నెలకొంది. ఈనేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి వేకువజామునే పురవీధుల్లో కార్మికులతో కలసి తిరుగుతూ దగ్గరుండి పారిశుధ్యపనులను సిబ్బందితో చేయిస్తున్నారు . ప్రధాన ఉత్సవాలు తిరిగే ప్రాంతాల్లో డ్రైనేజీ శుభ్రం చేయిస్తూ , రోడ్డుకిరువైపు బ్లీచింగ్ చల్లించారు.

## మండల సర్వసభ్య సమావేశం

**అల్లూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వైసిపి నాయకుల నుంచి ఆయా గ్రామాల్లోని సమస్యల్ని తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ చెంచయ్య, ఎంపిడివో శ్రీదేవి, స్పెషలాఫీసర్ మృదుల, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్ ఎంపిపి సురేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘం ఎన్నిక

**అల్లూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** అల్లూరు మండల బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రేవూరి గోవిందరావు, అధ్యక్షుడుగా కె. వి. రాధాకృష్ణారావు, ఉపాధ్యక్షులుగా యం. నాగరాజరావు, సి. సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బి. మణిప్రసాద్‌లు ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన అల్లూరు మండల బ్రాహ్మణ అధ్యక్షులు రాధాకృష్ణారావు మాట్లాడుతూ అల్లూరు మండల బ్రాహ్మణుల ఐక్యతకు కృషి చేస్తామన్నారు. పేద బ్రాహ్మణులకు అన్ని విధాల చేయూతనందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరు మండల బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి



**నెల్లూరు సిటీ, ఏప్రిల్4, ప్రభాతవార్త:** వైసీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించాలని నెల్లూరు రూరల్ 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి సూచించా రు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇంచార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో 23వ డివిజన్ పరిధిలోని పడారుపల్లి 23/3 పోలేరమ్మ చెట్టువీధి 2 సచివాలయంలో కన్వీనర్లు, వాలంట రీలు, గృహసారధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్పొరేషన్ కార్యాలయాచుట్టూ తిరగే అవసరం లేకుండా చేశారన్నారు. అదేవిధంగా వాలంటీర్లను నియమించి పింఛన్లు ఇంటి వద్దకే అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగాముందుకు సాగుతున్నామని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందించే బాధ్యతమనందరిపై ఉందన్నారు. వాలంటీర్లు, గృహసారధులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై వివరించాలనిసూచించారు. అవనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను వాలంటీర్లకు, రథసారధులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి పాతపాటి పుల్లారెడ్డి, మండల జెసిఎస్ ఇన్‌చార్జి మోయిళ్ళ సురేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన యాదవ మహాసంఘం



**ఉలవపాడు, ఏప్రిల్4, ప్రభాతవార్త:** మండలంలోని సుబ్బరాయుడు సత్రం గ్రామం రైల్వే గేటు వద్ద నాలుగవ రోజు నిరసన కార్యక్రమాలు గ్రామస్తులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా అఖిలభారత యాదవ మహాసంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఈటాప్ లలితారావు, బీసీ సంక్షేమ సంఘం కోవూరు అధ్యక్షులు సోమా గోపాల్ నక్క దినేష్ యాదవ్, నిరంజన్ తదితరులు పాల్గొని నిరసన చేపడుతున్న గ్రామస్తులకు తమ సంఘీభావాన్ని తెలిపారు. అదేవిధంగా ఉలవపాడు మండలం సీఐటియు కార్యదర్శి ఎస్డీ గౌస్‌భాషా నిరసనకారులకు తన సంఘీభావాన్ని తెలియజేశారు.

## సమన్వయంతో పనిచేయాలి



**కలువాయి ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** వైఎస్ఆర్‌సిపి అధిష్టానం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని మండల సచివాలయాల కన్వీనర్ మాదాసు యజ్ఞపవన్ పేర్కున్నారు. మంగళవారం కలువాయిలోని సంఘమిత్ర కార్యాలయం నందు యజ్ఞపవన్ ఆధ్వర్యంలో సచివాలయాల కన్వీనర్లు గృహసారదులు వాలంటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ ఎవ్వరు చేయని విధంగా గడిచిన నాలుగు సంవత్సరాలలో 2 లక్షల కోట్లకు పైగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాల ద్వారా నేరుగా వారి అకౌంట్ల నందు నగదు జమ చేయడం జరిగిందని యజ్ఞపవన్‌కుమార్ ఈమేరకు లబ్దిదారులకు కార్యక్రమం గురించి తెలియపరుస్తు ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వం అందించడం ద్వారా చేకూరిన లబ్దిని గుర్తు చేస్తు కన్వీనర్లు గృహసా రుదులు వాలింటరీలు వారదులుగా నిష్పక్షపాతంగా పనిచేయాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. అనంతరం మానమ్మకం నువ్వే జగన్ కిట్లను పాల్గోన్న అందరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ చల్లా రఘురామిరెడ్డి, నాయకులు మేకపాటి వెంకటనరసారెడ్డిలు పాల్గోన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

**చేజర్ల, ఏప్రిల్4(ప్రభాతవార్త:** చేజర్ల మండలం గొల్లపల్లి హెచ్‌డబ్ల్యు పాఠశాలలో విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పింది. ఉదయం పాఠశాల నిర్వహించే సమయంలో విద్యార్థులంతా ప్రార్థన చేసేందుకు సిద్ధమై పాఠశాల ప్రాంగణంలో నిలబడ్డారు. ఉపాధ్యాయురాలు వరండాలో నిలబడి ముఖ హాజరు వేసుకొని ప్రేయర్ నిర్వహించేందుకు బయటకు రాగానే పాఠశాల ఆవరణలోని శ్లాబ్ పెచ్చులూడి పడింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక్కసారిగా ఊపిరిపి ల్చుకున్నారు. అలాగే చేజర్ల ఎమ్మార్సీ కార్యాలయంలోను ఉదయం కార్యాలయ తలుపులు తెరిచేలోగా మండల



విద్యాశాఖాధికారి టేబుల్, కుర్చీపైన శ్లాబ్‌పెచ్చులూడి పడి ఉన్నాయి. ఆదివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి అకాల వర్షానికి ఏటూరు హరిజనవాడ పాఠశాల శ్లాబ్ పెచ్చులూడి పడడంతోపాటు వర్షపునీరంతా పాఠశాలలోనే నిలబడ్డాయి. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్పందించి పాఠశాలను, ఎంఇఒ కార్యాలయాన్ని సురక్షిత భవనాలకు తరలించకుంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి శిథిల దశకు చేరుకున్న పాఠశాలభవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

**చేజర్ల, ఏప్రిల్4(ప్రభాతవార్త:** చేజర్ల మండలం ఆదూరుపల్లిలో మంగళవారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా మూడురోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా మొదటిరోజు భక్తులు పండరిభజనలు వేస్తారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం జరుగుతుంది. గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో సంగీత వాయిద్యాల నడుమ కోలాహలంగా పండరిభజనలు, కోలాటాలు ప్రదర్శిస్తారు. పండరిభజన గురువు చీర్ల శీనయ్యదాసు ఆధ్వర్యంలో అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. రెండురోజులపాటుగా ఉపవాసాలుండి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాలకు హాజరవుతారు. పుచ్చకట్ల సోదరుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. బుధవారం కళ్యాణం, అన్నదానం, గ్రామోత్సవం జరుగుతుంది. గురువారం ఉట్టి మహోత్సవం, పారువేట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఈ నెల 6న ప్రజావేదిక

**వలేటివారిపాలెం ఏప్రిల్ 4 , ప్రభాతవార్త:** ఈ నెల 6వ తేదీన వలేటివారిపాలెంలో ఉపాధిహామీపథకం ద్వారా చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్ అహ్మద్ తెలిపారు. గత ఏడాది గ్రామాల్లో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో ఇటీవల సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో బాగంగానే మండల స్థాయిలో ఆయా పనుల నిర్వహణ తీరుతెన్నులను సామాజిక తనిఖీ బృందం బహిరంగపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. అదేవిధంగా ఆసక్తి గల వారంతా పాల్గొనవచ్చని ఆయన సూచించారు.

## బైకు-ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

**సైదాపురం ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** మండలకేంద్రమరైన సైదాపుంర పరిధిలోని గంగదేవిపల్లి రోడ్డు సమీపంలో స్కూటర్ ఆటో ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. స్దానికులు వివరాలు మేరకు మండల పరిధిలోని పాలూరు గ్రామానికి చెందిననక్కా శ్రీను, గణేష్‌లు ఆగ్రామం నుండి గూడూరు షాపుకు వెలుతుండగా గంగదేవిపల్లి రోడ్డు సమీపంలో వారి ముందు వెళుతున్న ఆటోను క్రాస్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనిగా శ్రీనుకి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్ధానికులు సైదాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా గూడూరు ఏరియా ఆసుప్రతికి తరలించారు.

## ప్రతి ఒక్కరు సోక్ పిట్ నిర్మాణం చేపట్టాలి



**వెంకటాచలం ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** మండలంలో పక్కా గృహం లబ్దిదారులు సోక్‌పిట్ నిర్మాణం చేపట్టాలని ఆర్‌బ్ల్యూ డిఈ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాచలంలో సోక్‌పిట్ నిర్మాణాని సోమవారం హౌసింగ్ డిఈ, వరప్రసాద్, తహశీల్దార్ కృష్ణ, ఎంపీడీవో సుస్మితతో కలిసి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లడుతూ ప్రతి హౌసింగ్ లబ్దిదారులు సోక్‌పిట్ చేపట్టడం వలన భూగర్భ జలాలు వృద్ధి చేందుతాయని తెలిపారు. జగనన్న లేవుట్‌లో పక్కా గృహాలు నిర్మించుకున్న ప్రతి ఒక్కరు నిర్మించుకోవాలని, 6 వేలు నగదు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. సోక్‌పిట్‌పై సచివాలయ శిబ్బందికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రముతో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టింట్‌లు పాల్గోన్నారు.

## సోషల్ మీడియాపై టిడిపి కార్యకర్తలు చురుకుగా వుండాలి

**కావలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** సోషల్ మీడియా వార్తల పట్ల టిడిపి కార్యకర్తలు చురుకుగా వ్యవహరిస్తూ పార్టీ వ్యతిరేక వార్తల్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా వుండాలని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి టిడిపి కార్యాలయంలో మంగళవారం



టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాలేపాటి మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో టిడిపి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేలా అందరు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. రానున్న ఎన్నికలలో కావలి నియోజకవర్గంలో టిడిపి బావుటా ఎగిరేలా నాయకుల, కార్యకర్తల పనితీరు వుండాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిపి నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు రసూల్ పాల్గొని పార్టీకి సంబంధించిన కార్యక్రమాలు టిడిపి యాప్‌లో అప్‌లోడ్ చేసే అంశాలపై అవగాహన కల్పించారు. జోనల్ మీటింగ్‌లో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ సమావేశంలో కావలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్‌బాబు, బొట్లగుంట శ్రీహరినాయుడు, గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, మొగిలి కల్లయ్య, దేవకుమార్ మాదిగ, తటవర్తి వాసు, ఏగూరి చంద్రశేఖర్, ఉప్పుటూరి బాలగురుస్వామి, పోతుగంటి శ్రీకాంత్, ఆత్మకూరి నాగరాజు, కాకి ప్రసాద్, గొట్టిపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చీరలు, భోజన ప్యాకెట్లు పంపిణీ

**కావలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కావలి పట్టణం పలు ప్రాంతాల్లోని పేదలకు సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం దాతల సహకారంతో చీరలు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. నెల్లూరు నగరానికి చెందిన శ్రీనివాసరావు, కనకారావు తల్లి 23వ వర్ధంతిని పురస్కరించుకొని కావలి శివరామసుబ్బయ్య కాలనీలో నివసిస్తున్న నిరుపేద గిరిజనులకు చీరలు వితరణ చేయడంతో పాటు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. కావలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లు ఎస్. కామేశ్వరి, రాజేష్‌కుమార్‌ల కుమారుడు నిశ్వాంత్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా కాలేరిగుంట సమీపంలోని గిరిజనులకు భోజన ప్యాకెట్లు అందజేశారు. దాతలకు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా ఫెన్సింగ్ వేశారని ఫిర్యాధు

**గిలకపాడు(రాపూరు), ఏప్రిల్04 ప్రభాతవార్త:** 30 ఏళ్ళుగా తమ ఇంటిలోకి వెల్తున్న దారికి అడ్డంగా ఫెన్సింగ్ వేశారని రాపూరు మండలంలోని గిలకపాడు గ్రామానికి చెందినచల్లా వీరరాఘవ రెడ్డి భార్య చల్లా పెంచలమ్మ 100కు దయల్



చేసి పిర్యాదు చేసింది. ఈ మేరకు రాపూరు పోలీసులు గ్రామంలోకివెళ్లి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా భాదితురాలు మాట్లాడుతూ తాము 30 సంవత్సరాల క్రింతం ఈ స్థలం కోనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. అప్పటి నుండి తాము ఇదే దారిలో నడుస్తుండగా మంగళవారం ఉదయం గ్రామానికి చెందినవేరోకరు దారికి అడ్డంగా ఫెన్సింగ్ నాటి తాము ఇంటిలోకి రాకపోకలు సాగేందుకు వీలు లేకుండా చేశారని ఆవేధన వ్యక్తం చేశారు. అయితే దారికి అడ్డంగా ఫెన్సింగ్ నాటిన వ్యక్తి మాట్లాడుతూ ఈ స్థలం తమది అని ఇందుకు సంబందించిన పత్రాలు వున్నట్లు తెలిపారు.

## తహశీల్దార్ కార్యాలయంముందు వీరంపల్లి రైతుల ధర్నా

**మనుబోలు, ఏప్రేల్4, ప్రభాతవార్త:** మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు తమపేరుతోవున్న పొలం రికార్డులను తారుమారుచేశారంటూ జెట్టి రామచంద్రారెడ్డి అనేరైతుకు మద్దతుగ ధర్నాచేశారు. దీనికి సంబందించిన పూర్వాపరాలు ఇలావున్నాయి. జట్టి రామచంద్రారెడ్డి అనేరైతు సర్వేనంబర్85బార్2లో4, 2సెంట్లు పొలంవుంది. ఈపొలం పాస్‌పుస్తకాలను బ్యాంక్‌లోపెట్టి వ్యవసాయరణం తెచ్చుకున్నట్లు తెలిపారు. ఈపొలం రికార్డులను అదేగ్రామానికిచెందిన తనదగ్గరి బంధువు సోదరుడైన జట్టి సురేంద్రరెడ్డి తహసిల్‌దార్ సుధీర్‌కి లంచం ఇచ్చి అనువంశితంకింద వన్‌బి, వెబ్‌లాండ్ అడంగల్ సురేంద్రరెడ్డి భార్యపేరుమీద మార్చుకున్నట్లు ఆరోపించారు. ఇలాచేసినందుకు తహసిల్‌దార్‌పై చర్యలుతీసుకోవాలని కలెక్టర్‌కు కూడా ఫిర్యాదుచేసినట్టు బాదితరైతు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయనకు మద్దతుగ నెల్లూరునుంచి వచ్చిన తెలుగుదేశంపార్టీ నాయకుడు విజయరాజు మాట్లాడారు. అనంతరం డి. టి బాలకోటమ్మకువినతిపత్రం అందజేశారు. అనంతరం కోదండరామపురం సెంటర్‌కువచ్చి వై. ఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి అర్జీఇచ్చారు. బాదితరైతుకు మద్దతుగ కనుపూరు కాలువప్రాజెక్టు కమిటి మాజీచైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, అన్నారపు రఘురామయ్య, యాళ్ళ యానాదినాయుడు, శివుడు రాజాగౌడు తదితరులు పాల్గొన్నారు. ఈవిషయమై ఆగ్రామానికి చెందిన వై. సి. పినాయకుడు జెట్టి సురేందర్‌రెడ్డి మాట్లాడుతు ఆపొలాన్ని గతపది ఏళ్ళక్రితం 30లక్షలకు తనకు అమ్మాడని ఆసొమ్ము తిరిగి ఇచ్చేస్తే తిరిగి ఆయనకు రిజిస్టర్‌చేస్తానని వివరించారు.

## నేడు మూడో విడత ఆసరా పంపిణీ

**బిట్రగుంట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదిన మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడివో ఆర్.గోవిందరావు తెలిపారు. పొదుపు గ్రూపులకు సంబంధించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అట్టహాసంగా 5.11 కోట్లు ఆసరా చెక్కులు పంపిణి




**సంగం ఏప్రిల్ 4 ప్రభాతవార** మండలకేంద్రమైన సంగంలోని తుంగదయాకర్‌రెడ్డి కళ్యాణ మండపంలో మెప్మా ఆద్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా నగదు చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల పార్టీ కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మండల వైసిపి నాయకులు కంతాబత్తిన రఘునాదరెడ్డి, జడ్‌పిటిసి మెంబర్ రావుల లక్ష్మీ, ఎంపిడిఓ గోపి , తుంగా ఇందూదర్‌రెడ్డి హాజరైయ్యారు. కార్యక్రమంలో ఎసిఎం లలితారెడ్డి, ఆత్మకూరు ఎసిఎం వెంకటేశ్వర్లు, ఎపిఎం విజయలక్ష్మీ పాల్గోన్నారు. మొట్టమొదట ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చి త్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కంతాబత్తిన రఘునాదరెడ్డి మాట్లాడుతు ముఖ్యమంత్రి మహిళలకు అన్ని రంగాలలో పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఆయన ప్రకటించిన విదంగా మహిళలకు విడతల వారిగా ఆశ్రా పథకం ద్వారా రుణమాఫీ చేస్తానని చెప్పారని మడిమ తిప్పని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కరోనా సమయంలో కూడా సంక్షేమపదకాలు అమలు చేసిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి ఒక్కరు జగనన్నను మరో సారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ సందర్బంగా 645 పొదుపు గ్రూప్ సంఘాలకు 5కోట్లా 11 లక్షలు చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో మండల జెఏసి కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, గాందీజనసంఘం గ్రామ సర్పంచ్ చందు, మక్తాపురం సర్పంచ్ ఫణికుమార్‌రెడ్డి, పెరమన సర్పంచ్ పట్టాభి, తరుణవాయి సర్పంచ్ బాల్‌నాయుడు, మండల వైసిపి నాయకులు బాలచంద్రరెడ్డి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు మడగల దేవసహాయం, తలుపూరుపాడు ఎంపిటిసి సభ్యులు కరిముల్లా, సంగం ఎంపిటిసిపట్టు వేణు తదితరులు పాల్గోన్నారు.

## నంది జాతీయ పురస్కారాన్ని అందుకున్న మాచవరం



**కావలి రూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఎంతో మందికి సేవ చేసి అందరి మన్ననలు పొందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాస్తు, జ్యోతిష్యం, పురోహిత రంగాలలో విశిష్టమైన కృషి చేసినందుకు గాను కావలి పట్టణానికి చెందిన బ్రహ్మశ్రీ మాచవరం గౌరిశంకరాచార్యులు హైదరాబాద్ శ్రీ త్యాగరామగాన సభ ఆడిటోరియం నందు 2023 సంవత్సరానికి సంబంధించి తెలుగు వెలుగు మహనంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మెమెంటోను, ప్రశంసా పత్రాన్ని అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తెలుగు వెలుగు సాహితీ వేదిక బాధ్యులు మాట్లాడుతూ వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వివిధ రంగాల వారికి ప్రతి సంవత్సరం పురస్కారాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. వాస్తు, జ్యోతిష్యం, పురోహిత రంగాలలో విశిష్ట సేవలందించినందుకు గాను బ్రహ్మశ్రీ మాచవరం గౌరిశంకరాచార్యులను ఎంపిక చేసి సత్కరించడం చాలా సంతోషంగా వుందన్నారు. ఆయన ఎన్నో సేవలందించి మరెన్నో పురస్కారాలను అందుకోవాలని కోరారు. ఈ సందర్బంగా కావలి, పరిసర ప్రాంతాల్లోని మాచవరం గౌరిశంకరాచార్యులు సన్నిహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రత్యేక పూజలలో బిగ్‌బాస్ ఆదిరెడ్డి



**వరికుంటపాడు, ఏప్రేల్4, ప్రభాతవార్తః** స్తానిక సాయినాదుని వార్సికోత్సవ సందర్బంగ సుంకర వెంకటాద్రి, సుజన దంపతుల ఆద్వర్యంలో నిర్వహించిన ప్రత్యేకపూజాకార్యక్రమంలో బిగ్‌బాస్ ఆదిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్బంగ ఆలయ అర్చకులు గోత్ర నామాలతో అర్చనాభిషేకాలు నిర్వహించారు. అలాగే టి.డి.పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుంకర అంజనాద్రి, సుంకర ఆదిత్య, మాజీ జట్.పిచైర్మన్ చెంచల్‌బాబు యాదవ్, మండల టి.డి.పి కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, నేతలు అంద్రా నాగిరెడ్డి, బోయిడి ప్రసాద్, చంద్ర వెంకయ్య, పొద మాధవరావు, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగ సాయినాధుని ప్రధమ వార్షికోత్సవవేడుకలు



**వరికుంటపాడు, ఏప్రేల్4, ప్రభాతవార్తః** మండల కేంద్రంలో వున్నటువంటి శ్రీసాయినాదుని ఆలయంలో మంగళవారం ప్రధమవార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగ ఘనంగా నిర్వహించారు. ఉదయంనుంచి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పాలాభిషేకం, పూర్ణాహుతి తదితర అభిషేకాలు నిర్వహించి సాయినాదునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సుంకర వెంకటాద్రి సుజన దంపతులు, సుంకర ఆతిద్య అశ్రుత దంపతులు, సుంకర అంజనాద్రి, విజయలక్ష్మి దంపతులుకదిరి వెంకటేశ్వరరావు, సంపూర్ణ, దొడ్డ సుధాకర్‌బాబు, రమణి దంపతులు, డాక్టర్ మాటూరి ఆదిశేషయ్య అనంతలక్ష్మి దంపతులు, ఇస్రో వైస్‌చైర్మన్ వాలా వెంకటేశ్వంరావు, ధరణి దంపతులు, కదిరి రాజేష్, రమ్య దంపతులు హోమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబూరావు, జట్‌పి.టి.సి రావెళ్ళ నాగేంద్ర, వై.సి.పి మండల కన్వీనర్ అంద్ర బాలగురవారెడ్డి, కదిరి ప్రకాష్‌రావు, కదిరి ప్రార్దసారధి, బోయిడి ప్రసాద్, నాయుడు ప్రకాష్, సుంకర రాధాకృష్ణ తదితరులు సాయినాదుని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగె స్వామివారిని ప్రత్యేక రథంపై గ్రామోత్సవం నిర్వహించి స్వామివారి పల్లకిసేవఊయలసేవ, హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మద్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో పుష్పాలతో అలంకరించా రు. వివిద గ్రామాలనుండి సాయినాదుని దర్శించుకొని భక్తులు తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.

## నేడు నేదురుమల్లి సైదాపురం రాక

**సైదాపురం ఏప్రిల్ 4 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ ,వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటగిరి నియోజవకర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నేడు సైదాపురం రానున్నారని ఎంపిడిఒ ఎం.వెంకటేశ్వర్లు, ఎపిఎం రాదమ్మ తెలిపారు. స్దానిక మండల పరిషత్ కార్యలయం ఆవరణంలో నిర్వహించే ఆస్రా కార్యక్రమంలో ఆయన పాల్గోంటారని వారు తెలిపారు.

## వైభవంగా రాములోరి వసంతోత్సవం



**జలదంకి, ఏప్రేల్4, ప్రభాతవార్తః** జలదంకి మండలం గోపన్నపాళెంలో మంగళవారం కోదండరాముని వసంతోత్సవం కోలాహలంగ సాగింది. శ్రీరామనవమి ఉత్సవా లలో భాగంగ ఈవేడుకను చేపట్టారు, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగ అలంకరించి మేళ తాళాలు డప్పు వాయిద్యాలనడుమ గ్రామోత్సవం చేశా రు. ఈసందర్బంగ ప్రతి గడపముందు నీరు వారపోసి కాయాకర్పూరం సమర్పించి భక్తులు మొక్కు కున్నారు. యువత వసంతాలు చల్లుకుంటూ ఆనందోత్సహాలతో గెంతులేశారు. సాయంత్రం పారువేటను సాంప్రదాయబద్దంగ నిర్వహించారు. ఈఉత్సవాలను ప్రతిఏడాది గ్రామంలో అత్యంత వైభవంగ చేపట్టడం ఆనవాయితి. దీనిని పురస్కరించుకొని ఇతరప్రాంతాలకు చదువులు, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం తరలి వెళ్ళినవారు శ్రీరామ నవమికి సొంతూరికి తరలివచ్చి ఉత్సవాలలో పాల్గొంటారు. ఉభయాల వారిగచేసేతిరునాళ్ళ సందర్బంగా గ్రామంలో ఆద్యాత్మికశోభ సంతరించుకుంది. ఉభయకర్తలుగ ఎదురూరివారు వ్యవహరించారు.

## రక్తహీనత కలిగిన గర్బవతులను గుర్తించండి



**సైదాపురం ఏప్రిల్ 4 ప్రభాతవార్త** గ్రామాలలోని గర్బవతులకు రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారిని గుర్తించాలని వైద్యులు డాక్టర్ జనార్ధన్, శ్రావణీ సూచించారు. సైదాపురంలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశా దినోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతుప్రస్తుత పరిస్దితులను బట్టి వ్యాపిస్తున్న జ్వరాలపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్దానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రక్తహీనత కలిగి వున్న గర్బవతులను గుర్తించి వారికి ఐరన్ మోడిసన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సూపర్నెంట్ వాసురావు, సూపర్‌వైజర్లు వైద్యసిబ్బంది పాల్గోన్నారు.

## పోటీతత్వాన్ని ప్రాథమిక స్థాయి నుంచే అలవాటు చేసుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్ధి ప్రాథమిక దశ నుంచే పోటీతత్వాన్ని అలవరుచుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని కోవూరు ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పాఠశాలకు చెందిన 5 మంది విద్యార్థినులు ఉపకార వేతనం కోసం ఎంపికయ్యారు. ఈ మేరకు వారితో పాటు వారిని ప్రోత్సహించిన 6 మంది ఉపాధ్యాయులకు ట్రస్టు ఆధ్వర్యంలో వాచ్‌లు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటినుంచే ప్రతి విద్యార్థి భవిష్యత్తులో తీను ఏమి కావాలనుకుంటున్నారో దానిని ఎంపిక చేసుకుని పట్టుదలతో దానిని సాధించే దిశగా ముందుకు సాగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా ఏ పని అయినా కష్టపడి కాకుండా ఇష్టపడి సాగితే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చగలిగే శక్తి ఉపాధ్యాయులకే ఉందని, పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే అంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాలకు చెందిన 5 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపిక కావడం పట్ల వారిని ప్రత్యేకంగా అభినంది స్తున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి మాట్లాడుతూ రానున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థులు మరిన్ని స్థానాలు సాధించేలా దృష్టి సారిస్తామన్నారు. ఉపాధ్యాయుల సహకారం విద్యార్థుల పట్టుదలతో ఈ ఆర్థిక సంవత్సరంలో 5 ఎన్ఎంఎంఎస్ సాధించడం జరిగిందని తెలియజేశారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్ఆర్‌కే స్కూల్ అధినేత కృష్ణమూర్తి 50 వేల రూపాయాల పారితోషకాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. అనంతరం 5 మంది విద్యార్థులు యు. హర్షిత, జి. పెంచల దిషా, సీహెచ్ మేఘన, ఎస్కే సిరాజున్నిసా, టి. అమృతలకు వాచ్‌లు పంపిణీ చేయగా.. ప్రోత్సహించిన ఉపాధ్యాయులు వాణిశ్రీ, రాధిక, ప్రభావతి, ఉమాదేవి, పరిణితలకు ప్రత్యేక బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు పి. మారుతీ నాగార్జున, సత్యవతి, సాయం కృష్ణచైతన్య, శ్రావణి, వేముల వెంకటేశ్వర్లు, శివప్రియ, నిఖిల్, హర్షద్ రఘువంశ్, శ్రీ చైత్ర, మహర్నిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఉన్నత పాఠశాలలో దొంగలు పడ్డారు



**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** విద్యార్థులకు విద్యను బోధించే పాఠశాలలో సైతం దొంగలు పడి కంప్యూటర్, దానికి సంబంధించిన ఇతర పరికరాలను ఎత్తుకెళ్లిన సంఘటన కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి ఫిర్యాదు మేరకు కోవూరు ఏఎస్సై సత్యనారాయణ, క్లూస్ టీమ్ బృందం సభ్యులు మంగళవారం పాఠశాలలో చోరీ జరిగిన గదిని నిశితంగా పరిశీలించారు. బీరువా తాళాలు తీశారే తప్ప అందులో ఏ విధమైన రికార్డులు పోలేదు. కేవలం మానిటర్, సీపీయూ, ఇతర కంప్యూటర్ సంబంధించిన పరికరాలు మాత్రమే అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు క్లూస్ టీమ్ బృందం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోవూరు పోలీసులు తెలిపారు.

## కోనమ్మతోటలో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** కోవూరు పంచా యతీ పరిధిలోని 5వ సచివాలయ ప్రాంతంలోని కోనమ్మతోటలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మం గళవారం కోవూరు ఎంపీడీవో శ్రీహరి, పంచాయతీ రాజ్ ఏఈ పరమేశ్వంలింగం పరిశీలించారు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతవాసులు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి సిమెంట్ రోడ్డు కావాలని విన్నవించారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో ఈ సచి వాలయ పరిధిలో మంజూరైన నిధులతో సిమెంట్ రోడునిర్మాణాన్ని త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## సయ్యద్ ఘనీబాషాను సత్కరించిన బియంఆర్

**కావలి రూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా స్వచ్ఛంద సంస్థ ద్వారా విశిష్ట సేవలందించినందుకు గాను ఇటీవల నెల్లూరు విశ్వంభర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సువర్ణకుమారి ఆధ్వర్యంలో జాతీయ సేవా పురస్కారం, మెమొంటోతో ఘనంగా సత్కరించిన సందర్భంగా రాజ్యసభ

**సర్టిఫికేట్‌లు పోయినవి**
నెల్లూరు పద్మావతి సెంటరుకు చెందిన ఇంగిలేల మహిత వినోల్య D/o. లేట్ మహేంద్రబాబు కు సంబందించిన B.Pharmacy Ist year, 2nd Year Marks Memos. నెల్లూరు వేదాయపాళెం నుండి పద్మావతి సెంటర్‌కు వెళ్ళుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెంబరులకు తెలియజేయగలరు.
సెల్: 9666868580, 7013082798



సభ్యులు, కావలి మాజీ శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కావలిలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బీద మస్తాన్‌రావును దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కావలిలోని అన్ని స్వచ్ఛంద సంస్థలు వారివారి పరిధిలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుండటం అభినందనీయమని వారికి నా సహాయ సహకారాలు ఎల్లవేళలా వుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్.కె.ఖాదర్‌బీ, రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ యం.వి.ప్రసాదరావు, విజయ్ భారత్ ట్రస్ట్ కిరణ్‌కుమార్, దివ్యాంగుల నాయకులు టి.సి.మాల్యాద్రినాయుడు, విశ్రాంత ఉప తహశీల్దార్ మొగల్ సిరాజ్, జాగో జమీర్, ట్రైంటు హెల్ప్ రమేష్, సంయుక్త సేవా సంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, గుడ్‌మెన్ బ్రహ్మయ్య, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, ప్రభయ్య, దేవరకొండ విజయ్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న గోరుముద్ద భేష్



**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని మంగళవారం మండల విద్యాశాఖ అధికారి రహీమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ ఎక్కడా లేని విధంగా మెనూలో లేని పచ్చడి, వడియాలు కూడా విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ఏజెన్సీలను మిగతా వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, దానిని ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## దశాబ్దాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే



**కోవూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీ నగర్‌లో మురుగునీటి సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతం నుంచి మురికినీరు బయటకు వెళ్లేందుగా సరైన మారనగం లేక ఈ ప్రాంతవాసులు దశాబ్ద కాలంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి ఈ ప్రాంతవాసులు డ్రైనేజీ సమస్య గురించి మొరపెట్టుకున్నారు. ఈ మేరకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజీ పరిష్కారానికి 20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం నేతాజీనగర్ ప్రాంతంలో డ్రైన్ పనులకు సాంప్రదాయ బద్ధంగా శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ఈ ప్రాంతవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ రవీంద్ర, గ్రామ సర్పంచ్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ఎంపీటీసీ సభ్యులు పర్వీన్, బాబురావు, కె. లక్ష్మయ్య, మండల సచివాలయాల కన్వీనర్ కె. ప్రసాద్, నేతలు ఉన్నారు.

## అడుగు దూరంలో అధికారం



**నెల్లూరు ఏప్రిల్ 4, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో దూరంలో లేదని ఒకే ఒక్క అడుగు దూరంలో ఉన్నామని అందరం సమిష్టిగా కలిసి పనిచేస్తే అధికారం చేజిక్కిం చుకోవచ్చని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నగర ఇన్‌చార్జ్ కోటం రెడ్డి.శ్రీనివా సులురెడ్డి ఆధ్వర్యంలో ఐటీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు రసూల్, నగర ఐటీడీపీ అధ్య క్షుడు వినుకుల. సుధాకర్‌రాజు టెలిగ్రామ్ బాట్ ఏలా ఉపయోగించాలో క్లస్టర్ ఇన్‌చార్జ్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్బంగా కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మరో ఆరు నెలలు వైసీపీ అరాచకాలను అడ్డుకుంటే అధికారంలోకి వస్తామన్నారు. నగర నియోజకవర్గంలో ఏ వీధిలోకి వెళ్ళినా టీడీపీ హయాంలో జరిగిన అభివృద్దే కనిపిస్తోందన్నారు. మరో ఆరు నెలల్లో ప్రభుత్వం మారబోతోందని ఆయన అన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేస్తే అధికారంలోకి రావడం తధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల.విజేతరెడ్డి, తాళ్లపాక.అనూరాధ, నగర అధ్యక్షుడు మామిడాల.మధు, కప్పిర.శ్రీనివాసులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు



గుడ్లూరు,ఏప్రిల్4,ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైయస్‌ఆర్ ఆసరా మూడో విడత సంబరాలకార్యక్రమం గుడ్లూరు మండలంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరై మండలానికి చెందిన 1034 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు 8కోట్లా 17లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల వైయస్‌ఆర్ క్రాంతి పథం ఇంచార్జి ఏపీఎం నవీన్, డ్వాక్రా సంఘం మండల అధ్యక్షురాలు దన్యాసిమరియమ్మ, పంచాయతీసర్పంచ్ పాలకీర్థి శంకర్, సీసీజిలానీభాషా, అనురాధ, మాల్యాద్రి ,ఎంఆర్ఓ, ఎంపీడీవో, ఎంపీపీ పులి రమేష్, జడ్పిటీసీ కొర్శిపాటి బాపిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గాజుల కిషోర్, బ్యాంక్ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ఉలవపాడులో......వైయస్సార్** ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉలవపాడులోని వెలుగు కార్యలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డిహాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని అన్నారు. అందువల్ల ప్రతి పథకాన్ని మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. 9కోట్లా 27లక్షల రూపాయల చెక్కులను శాసనసభ్యుడి చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏటిఎం బి.నవీన్, జడ్పిటీసీ చేవూరి అరుణ, ఎంపీపీ వాయిల మస్తానమ్మ, కోఆప్షన్ నెంబర్ ఖాధర్‌భాషా, ఎంపీడీవో ఎల్.చెంచమ్మ, గ్రామ సర్పంచ్ విజయమ్మ, గ్రూపు సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



**నెల్లూరు సిటీ,ఏప్రిల్4,ప్రభాతవార్త** మూడోవిడత వైయస్ ఆర్ ఆసరా పథకానికి సంబంధించిన చెక్కులను స్వయం సహాయక సంఘాలకు మాజీమంత్రి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ పంపిణీ చేశారు. నెల్లూరు మినీ బైపాస్‌రోడ్‌లోని మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌మాట్లాడుతూ 2196 స్వయం సహాయక సంఘాల్లోని 19,358గ్రుప్ సభ్యులకు 15.87కోట్ల రూపాయల చెక్కులను అందజేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలనుఅందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని గుర్తుచేశారు. ముడు పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేయడమే తన ముందున్న లక్ష్యమని తెలిపారు. కరోనా, వరదలు వంటి విపత్తుల పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులను పట్టించుకోని వారు ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల కోసం పనిచేస్తామంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలన్నా రు. కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ ఖలీల్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర, పలువరు కార్పొరేటర్లు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## ర్యాంకర్లకు అభినందన



**నెల్లూరు,ఏఫ్రిల్30 ప్రభాతవార్త-విద్య** వి క్రమసింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిష్టర్ ఫలితాల్లో నగరంలోని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. బిసిఏ విభాగంలో ఎస్‌కే.షరీన్ 99శాతం, బికాంలో ఏ.రోలీ కుమారి 99శాతం, బిబిఏలో వి.జాహ్నవి 99శా తం,ఎస్.నరసింహ 96శాతం జిపీతో యూనివర్శిటీ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక కళా శాలలో ర్యాంకర్లకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రావూస్ విద్యాసంస్థల డైరెక్టర్ వై.శివసంకేత్ ఈ సందర్భంగా మాట్లాడుతు తమ విద్యార్థులు అన్నీ విభాగాల్లో యూనివర్శిటీ ప్రథమర్యాంకులు సా ధించటం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో వీరు మరిన్ని విజయాలు సాధించాలని ఆయన కోరారు. ఇంతటి విజయాలు సాధించేందుకు కృషిచేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. సీఈఓ ఎన్.శివారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మన్నెమాల సస్పెన్షన్‌తో లేఅవుట్లపై కన్నెర్ర చేసిన మున్సిపల్



**కావలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** వైసిపి పార్టీ కీలక నేత, మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయడంతో ఆయనకు సంబంధించిన అక్రమ లేఅవుట్లపై కా వలి మున్సిపల్ అధికా రులు కన్నెర్ర చేశారు. మంగళ వారం మధ్యాహ్నం ఈ అక్రమ లేఅవుట్లలోని రోడ్లను మున్సిపల్ అధికారులు ధ్వంసం చేశారు. కావలి మున్సిపాల్టీ పరిధిలో అక్రమ లేఅవుట్ల భరతం పట్టాలని ప్రజాసం ఘాలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు విమర్శలు గుప్పిస్తూ గగ్గోలు పెట్టినా ఈ మూడేళ్లలో పట్టించుకోని ము న్సిపల్ అధికారులు ఉన్నపళంగా అక్రమ లేఅవుట్లలో రోడ్లు ధ్వంసం చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. కావలి వైసిపి నేతల్లో ప్రకంపనలు సృష్టించినట్లయింది. అయితే ఈ అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లు పూర్తి స్థాయిలో అమ్మకాలు సా గిన తర్వాత మున్సిపల్ అధికారులు చేపట్టిన చర్యలు ప్లాట్లు కొన్నవారికి కష్టాలు మొదలయ్యాయి. లేఅ వుట్లు వేసిన నిర్వాహకులు మాత్రం ఎటువంటి నొప్పిలేదన్న వాదనల్ని కొంతమంది వైసిపి నేతలు బహి రంగంగా చెబుతున్నారు. చట్టం తన పని ఏ రోజైనా చేస్తుందని, ప్లాట్లు కొనుగోలు చేసే వ్యక్తులు అక్రమమా, సక్రమమా అని తెలుసుకోకుండా కొనుగోలు చేస్తే ఇటువంటి ఇబ్బందులే వస్తాయని మున్సిపల్ అధికారులు బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొని నష్టపోవద్దని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

## వివస్త్రను చేసి కొట్టడం అమానుషం

**నెల్లూరు ఏప్రిల్ 4, ప్రభాతవార్త-వైద్యం** సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలో వైసీపీ సర్పంచ్ పిలుస్తున్నాడని ఆ గ్రామానికి చెందిన పల్లపి.కొండయ్య భార్య అనసూయను అదే గ్రామానికి చెందిన పెంచలయ్య పిలిపించి అనసూయ అనే మహిళను వివస్త్రను చేసి కొట్టడం దుర్మార్గమని రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికే ఉందా అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకులకిషోర్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని దర్గామిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ పెద్దాసుపత్రిలో వివస్త్రను చేసి కొట్టిన అనసూయ ఆత్మహత్య ప్రయత్నం చేసి చికిత్స పొందుతున్న ఆమెను కిషోర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నియోజకవర్గంలో ఆయన అనుచరులు ఒక మహిళ అని కూడా చూడకుండా ఆమెను వివస్త్రను చేసి దాడి చేయడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సి న పరిస్థితి ఏర్పడిందన్నారు. సర్పంచ్ తనవాడే అనే అహంకారంతో అనసూయపై పెంచలయ్య వ్యవహరించిన తీరుకు పోలీసులు తక్షణమే కఠిన శిక్ష వేసి బాధితురాలికి తగిన న్యాయం చేయాలని లేనిపక్షంలో బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాడడమే కాకుండా తమ పార్టీ ఆమెకు అండగా ఉంటుందన్నారు. పేదల పట్ల కనికకరం లేకుండా దాడి చేయడం దారుణమన్నారు. వెంటనే అధికారులైనా స్పందించి పెంచలయ్య తగిన చర్యలు తీసుకోవాలని గునుకుల డిమాండ్ చేశారు. రూ.10వేల అప్పు తిరిగి ఇవ్వకపోతే వివస్త్రను చేస్తారని నిలదీశారు. డబ్బులుతిరిగి ఇవ్వకపోతే మహిళ అని కూడా చూడకుండా కొట్టమని వైసీపీ అధిష్టానం చెప్పిందాని ఆయన మండిపడ్డారు. అనాగరికంగా పేదమహిళపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అధికార మదంతో వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు లక్ష్మన్, బలచంద, రాజేష్, శ్రీను, ప్రతాప్, సాయి, దీపక్, ప్రశాంత్‌గౌడ్, మౌనేష్, వర, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటమే



**నెల్లూరు ఏప్రిల్ 4, ప్రభాతవార్త - వైద్యం** తన నియోజకవర్గంలో గత నాలుగేళ్ళుగా అనేక సమస్యలు ఉన్నాయని, రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా వాటి పరిష్కారం కోసం గాంధీగిరి తరహాలో అలు పెరగని పోరాటం చేస్తానని నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని కేవిఆర్ పెట్రోల్ సమీపంలో ఉన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను ఎంతో నమ్మకంతో గెలిపించుకున్న ప్రజల సమస్యలను పరిష్కరించేలా పనిచేయడం, అన్ని విధాలా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం తన కర్తవ్యమని కోటంరెడ్డి పేర్కొ న్నారు. ఈ తరుణంలో ఈనెల 6న పొట్టేపాళెం కలుజుపై వంతెన నిర్మాణానికి మన ఎమ్మెల్యే మన వంతెన పేరుతో ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా జలదీక్షను చేపడుతున్నామని, ఈ జలదీక్షకు మద్ధతుగా అవకాశం ఉన్న నియోజకవర్గ ప్రజలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వంతెన కోసం నాలుగేళ్ళుగా అధికార పార్టీ ఎమ్మెల్యేగా సీఎం, మినిస్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు నుంచి జల్లా కలెక్టర్, ఇతర అధికారుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగి అలసిపోయానన్నారు. అయినా ఇప్పటి వరకు వంతెన నిర్మాణం జరగలేదన్నారు. జిల్లా, రాష్ట్రాల ప్రజలు కూడా ఆ దారి వెంట సమీపంలోని పుణ్యక్షేత్రాల దర్శనం కోసం నిరంతరం ప్రయాణిస్తూ ఉంటారన్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో కొన్ని వందల ప్రమాదాలు జరిగాయని అనేకమంది నిత్యం అవస్థలు పడుతున్నారన్నారు. సాక్షాత్తు సీఎం చెప్పినా ఇక్కడ వంతెన రాలేదంటూ ముఖ్యమంత్రి ఆదేశాలను బేఖాతరు చేశారంటే ఈ ప్రభుత్వ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. 2019 జూలై నెల 25న సీఎం జగన్‌ని నేను స్వయంగా కలిసి పొట్టేపాళెం కలుజుపై వంతెన, ములుముడి డొంక వంతెనలతోపాటు నెల్లూరు నుంచి సౌత్‌మోపూరు మీదుగా తాటిపర్తి రోడ్డు నిర్మాణం కోసం విన్నవించుకున్న కూడా సీఎం ఆదేశించినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దాదాపుగా ఒకటిన్నర ఏడాది క్రితం జిల్లా వచ్చిన సీఎం స్వయంగా ఆ ప్రాంతంలో పర్యటిస్తూ ఆ పనులు వెంటనే చేపట్టేలా ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. వాటికి కూడా ఇంతవరకు అతీగతీ లేదన్నారు. తనకు పార్టీలు, రాజకీయాల కన్నా తనను నమ్మి ఓటు వేసి గెలిపించిన ప్రజలే ముఖ్యమని, ఆ ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం గాంధీగిరి తరహాలో నిరంతరం ఉద్యమాలు చేస్తూనే ఉంటానన్నారు. అందులో ప్రజలను భాగస్వాములను చేసుకుని ముందుకు సాగుతానన్నారు. నిరంతరం రహదారిలో అవసరమైన నిర్మాణాల కోసం కేవలం రూ.40కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చు చేయలేదాని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న పెద్దలైన ఆ పనులకు నిధులు మంజూరు చేయించి, తన పేరు కూడా లేకుండా శిలా ఫలకాన్ని వేసుకుని శంఖుస్థాపన చేసినా తాను సంతోషిస్తానన్నారు. తన నియోజకవర్గంలో పూర్తి కాని పనులను పూర్తి చేస్తే సీఎం అవకాశం ఇవ్వకపోయినా తానే నేరుగా వెళ్లి సీఎం జగన్‌ని సన్మానిస్తానన్నారు. ఈనెల 6న చేపడుతున్న జలదీక్షకు కూర్చున్న సమయంలో తనకు మద్ధతుగా కనీసం రెండు నిమిషాలు భగవంతుడుని ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు. జనం చెప్పింది విందాం పేరుతో త్వరలో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు.

## మౌళిక వసతులపై డిఎమ్ఎ వీడియో కాన్ఫరెన్స్




**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 4,ప్రభాతవార్త** నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్, అన్ని విభాగాల ఉన్నతాధికారులతో కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీ ణ్‌కుమార్ ఐఏఎస్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించా రు. నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ విభా గంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా రీ సర్వే విధా నం, రోడ్ల రిపేర్లు, జగనన్న కాలనీల్లో గృ హాల నిర్మాణం, మౌళిక సదుపాయాల ఏర్పాట్లు, క్లాప్ కా ర్యక్రమం వంటి వివిధ అంశాల పురోగతిని చర్చించారు .నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల విభాగంలో కమీషనర్ హరిత, డిప్యూటీ కమీషనర్ చెన్నుడు, ఇతర విభాగాల ఉన్నతాధికా రులుపాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో అడ్మిన్, వార్డు ప్లానింగ్, శానిటేషన్ వార్డు కార్యదర్శులు హాజరయ్యారు.


# ఉత్తరక్రియలు

పదవులకు పొంగనివాడు..
ఆటుపోట్లకు క్రుంగనివాడు..
తారతమ్యములు చూడనివాడు..
దయాగుణంలో అందరివాడు..
అందరి క్షేమం కోరేవాడు..
రామ బాటలో నడిచినవాడు.. మా ఇంటి దైవం

గౌ॥ చెన్ను బాలకృష్ణారెడ్డి గారు

తేది 27.03.2023 సోమవారము స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ..



శ్రీ॥ చెన్ను బాలకృష్ణారెడ్డి గారు
మండల పరిషత్ అధ్యక్షులు, రాపూరు
మరణం: 27-03-2023

అశ్రునయనాలతో...
కుటుంబ సభ్యులు

శిలా ప్రతిష్ఠ తేది: 5-4-2023 బుధవారం
పెద్దకర్మ తేది: 6-4-2023 గురువారం

చెన్ను గార్డన్స్, తానంచర్ల గ్రామం, రాపూరు మండలం, నెల్లూరు జిల్లాలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.